ప్రత్యామ్నాయం చూపించండి సారూ

- అక్రమ నిర్మాణాలు అంటూ మేడిపల్లి సెంటర్‌లో దుకాణాల తొలగింపు
- సరైన స్థలం కేటాయించాలని చిరు వ్యాపారుల వినతి



మేడిపల్లి సెంటర్‌లో దుకాణాల కూల్చివేత

జ్యోతినగర్: '30ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఒక్కసారిగా అక్రమ నిర్మాణాలు అని, గ్రీన్ బెల్ట్ ప్రాంతం అని మా దుకాణాలను తొలగించడంతో జీవనోపాధి కోల్పోయాం. మా కుటుంబాలు రోడ్డున పడేలా ఉన్నాయి' అని ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లోని 50మందికి పైగా చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.

దుకాణాలు తొలగింపు..

15రోజుల క్రితం మేడిపల్లి సెంటర్‌లో అక్రమ నిర్మాణాలు అంటూ కూల్చివేశారు. చిరు వ్యాపారులు తమకు ప్రత్యామ్నాయం చూపించాలంటూ అధికారులను వేడుకున్నారు. వారసంత సమీపంలోని స్థలంలో 50మంది చిరు వ్యాపారులకు స్థలాలను మార్కింగ్ చేసి కమిషనర్ శ్రీకాంత్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు కేటాయించారు. అయితే వ్యాపారులు స్థలాలను చూసి దుకాణాలను ఏర్పాటు చేసుకునే సమయానికి ఎన్టీపీసీ సంస్థ వారసంతకు హద్దుగా సర్వీసు రోడ్డుపక్కన గోడ నిర్మాణం చేపట్టారు. గోడ నిర్మాణాన్ని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సమక్షంలో చిరు వ్యాపారులు గోడతో పాటు దారిని సైతం కూల్చివేశారు.

సరైన స్థలం కేటాయించాలి..

మేడిపల్లి సెంటర్‌లో దుకాణాలు తొలగించారు. ప్రత్యామ్నాయంగా స్థలాలను కేటాయించారు. కేటాయించిన స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేయకముందే ఎన్టీపీసీ సంస్థ గోడ నిర్మించడంతో దుకాణాలు ఏర్పాటు చేయడానికి వీలు లేదని చిరు వ్యాపారులు వాపోతున్నారు. సరైన స్థలం కేటాయించి జీవనోపాధి కల్పించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.

ఆర్థికంగా ఇబ్బందులు



మా నాన్న 30ఏళ్ల నుంచి టిఫిన్ సెంటర్‌తో జీవనోపాధి పొందినం. ఇటీవల మా నాన్న చనిపోయాడు. మాకు ఉన్న టిఫిన్ సెంటర్ కోల్పోవడంతో మేము చాలా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. మాకు సరైన స్థలం చూపించండి.

– సుద్దాల సాయిరాం, టిఫిన్ సెంటర్

మమ్మల్ని పట్టించుకోవాలి



పండ్లను విక్రయించి బతుకుతున్నాం. దుకాణాలను తొలగించడంతో ఇబ్బందిగా ఉంది. మాకు ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని రోడ్ పక్కన స్థలం కేటాయించి, విద్యుత్ లైన్, నీటి వసతి కల్పించండి. మా ఆర్థిక పరిస్థితులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి.

– సత్యనారాయణ, పండ్ల దుకాణం

స్థలాన్ని పరిశీలిస్తున్నాం



మేడిపల్లి సెంటర్‌లోని గ్రీన్ బెల్ట్ స్థలంలో తొలగించిన దుకాణాల చిరువ్యాపారుల కోసం ప్రత్యామ్నాయంగా కేటాయించేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్నాం. అందరికీ ఒకేచోట కాకుండా వారి వ్యాపారాలు కొనసాగేలా స్థలాలను పరిశీలించి త్వరలో కేటాయిస్తాం.

– సీహెచ్.శ్రీకాంత్, కమిషనర్, రామగుండం

రోడ్డు నిర్మించాలని నిరసన



నిరసనలో మాజీ కార్పొరేటర్, స్థానికులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ మాజీ కార్పొరేటర్ బొబ్బిలి సతీశ్ బుధవారం నిరసన తెలిపారు. స్థానిక ఫైవింక్లయిన్ ఏరియాలో కాలనీవాసులతో కలిసి రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. సతీశ్ మాట్లాడుతూ స్థానిక 33వ, 34వ డివిజన్ పరిధిలో ఉండే ఈ ప్రధాన రహదారి నిర్మాణం కోసం, నాలుగున్నరేళ్ల క్రితమే రూ.76లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మూడేళ్ల క్రితం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేసి వదిలేశారని తెలిపారు. ఇసుక కొరత ఉందని రోడ్డు నిర్మించకుండా వదిలేశారన్నారు. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయానన్నారు. కనీసం అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్, సింగరేణి అధికారులు వెంటనే చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా మున్సిపల్ కమిషనర్ ఫోన్‌లో హామీ ఇవ్వడంతో నిరసన విరమింపజేసినట్లు మాజీ కార్పొరేటర్ తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జీఎం ఆఫీస్ గ్రౌండ్‌లో సెక్యూరిటీ సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి నెలలు గడుస్తున్నా గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా గుర్తింపు పత్రం ఇచ్చి కార్మిక సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు మెండె శ్రీనివాస్, ఆరెపల్లి రాజమౌళి, సానం రవి, పి.శ్రీనివాస్, ఎస్.రవీందర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



రామగిరి: రత్నాపూర్‌లో కేంద్రం ప్రారంభం



ముత్తారం: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం పద్మ

రామగిరి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శైలజారాణి, ఏపీఎం స్వరూపరాణి అన్నారు. బుధవారం మండలంలోని రత్నాపూర్, బేగంపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ప్రభుత్వం మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2203, కామన్ గ్రేడ్ రకానికి రూ.2183 చెల్లిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కరీమా, సీసీలు శంకర్, రమేశ్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ముత్తారం: మండలంలోని మచ్చుపేట, మైదంబండ, కేశనపల్లి, హరిపురం, ముత్తారంలో ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఐకేపీ ఏపీఎం పద్మ, ఎంపీవో వేణుమాధవ్ ప్రారంభించారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి హారిక, ఐకేపీ అధికారులు తిరుపతి, రాజ్యలక్ష్మి, రాధిక, కవిత, కొనుగోలు కేంద్రాల కమిటీ ప్రతినిధులు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మైనార్టీ సోదరులు

జూలపల్లి: మత సామరస్యానికి, శాంతికి ప్రతీకగా ఇఫ్తార్ విందు నిలుస్తుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలోని మసీద్‌లో రంజాన్ పండుగను పురస్కరించుకొని మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను మైనార్టీ సోదరులు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను మైనార్టీ సోదరులు సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు వేణుగోపాలరావు, గండు సంజీవ్, నర్సింహయాదవ్, బొజ్జ శ్రీనివాస్, కొమ్మ పోచాలు, బండి స్వామి, ఫకీర్, సమద్, యూసుఫ్, అతిక్, హన్మంతరెడ్డి ఉన్నారు.

'ఇసుక క్వారీ మూసివేసే దాకా ఉద్యమిస్తాం'



ఇసుక క్వారీ వద్ద భోజనం చేస్తున్న గ్రామస్తులు

సుల్తానాబాద్‌రూరల్: మండలం గట్టెపల్లి మానేరు వాగులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్(క్వారీ) మూసివేసే దాకా ఉద్యమిస్తామని గ్రామస్తులు డిమాండ్ చేస్తూ ఐదురోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఇసుక క్వారీ వద్ద వంటావార్పు చేసుకొని అక్కడే భోజనాలు చేశారు. నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ మండల నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో దామోదర్‌రావు, రాజయ్య, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: రంజాన్ పండుగ వేళ ఈద్గా వద్ద రామగుండం నగరపాలక సంస్థ చేస్తున్న ఏర్పాట్లలో పాల్గొన్నాడు ఒక ఆంజనేయ మాలధారుడు. బుధవారం ఈద్గా వద్ద ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ సీ.హెచ్.శ్రీకాంత్ పరిశీలిస్తుండగా తీసిన చిత్రమిది. పారిశుద్ధ్య పర్యవేక్షకుడిగా పని చేస్తున్న తిరుపతి ఆంజనేయస్వామి మాల ధరించాడు. వృత్తిలో భాగంగా ఈద్గా వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాడు. మంగళవారం హిందువుల ఇళ్లలో ముస్లింలు ఉగాది పచ్చడి రుచి చూడగా, గురువారం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం ఇళ్లలో తయారు చేసే సేమియా పాయసం రుచి ఆస్వాదించడానికి హిందువులను ఆహ్వానిస్తున్నారు. రంజాన్ నెలలో ముస్లింలకు హిందువులు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయగా, మొన్నటి వరకు మాల ధరించిన అయ్యప్ప స్వాములకు ముస్లింలు అల్పాహారం, భిక్ష ఏర్పాటు చేశారు.

పాఠశాలల పరిశీలన



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎలిగేడు: మండలంలోని పలు పాఠశాలలను బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలిగేడు జెడ్పీహెచ్ఎస్ ఎంపీపీఎస్, ఎంపీపీఎస్(ఎస్సీకాలనీ), శివపల్లి గ్రామంలోని ఎంపీపీఎస్(ఎస్సీకాలనీ), ఎంపీయూపీఎస్, సుల్తాన్‌పూర్‌లోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్, ఎంపీపీస్(ఎస్సీకాలనీ), బుర్హాన్‌మియాపేటలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, పాఠశాలల ఎస్ఎంసీ చైర్‌పర్సన్లు సందర్శించారు. పాఠశాలల్లో పెండింగ్ పనులు, బాలికలు, బాలుర మరుగుదొడ్లు, తాగునీరు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సంబంధించిన పనులను గుర్తించి వాటికి సంబంధించిన పనులను అంచనా చేశారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, పీఆర్ ఏఈ జగదీష్, ఏపీఎం సుధాకర్, సీసీలు గీస ఆనంద్, మల్లేశం పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శాంతినగర్‌లోని శ్రీకోదండ రామాలయంలో 17న రామనవమి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ముడుసు సాంబిరెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల పూజలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో బుధవారం భక్తులు పూజలు చేశారు. దేవస్థానంలోని కోనేరులో భక్తులు స్నానాలను ఆచరించి దర్శనం చేసుకున్నారు. భక్తులు బోనాలు సమర్పించి స్వామివారి పేరిట పట్నాలు వేశారు. మల్లికార్జునస్వామి, సీతారామచంద్రస్వామి, ఖండేలరాయుడు, నందీశ్వరులను దర్శించుకున్నారు.

శ్రీవాణి కళాశాలల వార్షిక వేడుకలు



సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నర్సయ్యపల్లిలోని విజయ ఏసీ గార్డెన్‌లో బుధవారం శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలల వార్షిక వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డాక్టర్ లయన్ రేకులపల్లి విజయ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి అనుకున్న లక్ష్యాన్ని అందుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించింది. ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, పీజీ ఇన్‌చార్జి శ్రీనివాస్, సదానందరం, బండి కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వర్తక సంఘం నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్

ధర్మారం: వర్తక సంఘం మండల అధ్యక్షుడు కుంట రాజు ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ మండల కార్యాలయంలో రాజు ఆధ్వర్యంలో దాదాపు 50 మంది పార్టీలో చేరారు. కాగా వారికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పద్మశాలీ సంఘం మాజీ అధ్యక్షుడు గోనె దేవయ్య, నాయకులు బుదారపు వేణుగోపాల్, కుంట తిరుపతి, బుదారపు రాజు, కందుల శ్రీనివాస్, తుమ్మ శ్రీనివాస్, కడారి రాజు, పెంచికల లింగమూర్తి, మధుసూదన్, వంగరి నరేశ్ ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లావుడ్య రూప్లానాయక్, నాయకులు చింతల ప్రదీప్‌రెడ్డి, కొత్త నర్సింహం, కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామాలయంలో నవరాత్రి మహోత్సవాలు



గణపతి హోమం చేస్తున్న దంపతులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. ఉదయం నిత్యపూజలతో ప్రారంభమై అభిషేకాలు, గణపతి హోమం, అర్చనలు జరిగాయి. అర్చక పురోహితులు దత్తుశర్మ హోమక్రతువు చేశారు. మిల్క్ డిస్ట్రిబ్యూటర్ ప్రవీణ్ దంపతులు గణపతి హోమం నిర్వహించారు. అర్చక పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. భారతి సిమెంట్ డీలర్ రాజేందర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో వ్యాసరచన పోటీలు

గోదావరిఖని: బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని స్థానిక సింగరేణి స్కూల్‌లో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'దేశానికి, సమాజానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన కృషి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ లక్ష్మీనారాయణ, హెచ్ఎం బి.శ్రీనివాస్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు స్వర్ణలత, శ్రీలత పాల్గొన్నారు.

ఓసీపీ–2 పిట్ సెక్రెటరీకి సన్మానం



సన్మానిస్తున్న బెల్ట్ కార్మికులు

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 పిట్ సెక్రెటరీగా నియమితులైన రామిండ్ల మనోహర్‌ను బుధవారం ఓసీపీ–2 బెల్ట్ క్లీనింగ్ కార్మికులు సన్మానించారు. ఐఎన్‌టీయూసీలో సామాన్య కార్యకర్తగా కష్టపడుతూ నేడు పిట్ సెక్రెటరీ స్థాయికి ఎదిగారని, భవిష్యత్‌లో మరెన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు. బెల్ట్ క్లీనింగ్ కార్మికులు పులి శ్రీనివాస్, రామిండ్ల సంపత్, రతన్ రాజేశం, అక్కపాక రాజేశం, కాసిపేట లింగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫేర్‌వెల్ హంగామా



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఫేర్‌వెల్ నిర్వహించారు. బుధవారం అన్నపూర్ణకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థులు ఎనిమిదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య మాట్లాడారు. అనంతరం హెచ్ఎంగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై కమాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్‌కు వెళ్లిన హెచ్ఎం రజిత కుమారిని, నూతనంగా మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆరెపల్లి రాజయ్యను సన్మానించారు. విద్యార్థుల చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం రేణుక, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు బేడి రాణి, ఆకుల రాజన్న, రాములు, ప్రశాంతి, రంజిత, లక్ష్మణ్, రమణ, దేవిక పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామయాగ మహోత్సవానికి ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట శ్రీషిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఈనెల 12, 13వ తేదీల్లో ఆలయ వార్షికోత్సవాలతో పాటు, 13న 108 మంది పుణ్య దంపతులతో అయోధ్య శ్రీరామ యాగ మహోత్సవాల ఏర్పాట్లు ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, భక్తులకు కనీస సౌకర్యాల ఏర్పాటుపై ఆలయ కమిటీ ప్రతినిధి కన్నూరి సతీశ్‌కుమార్ ప్రత్యేక దృష్టిసారించారు.

సామాజిక న్యాయ ఉద్యమనిధి సేకరణ



ఉద్యమ నిధిని సేకరిస్తున్న నాయకులు

జ్యోతినగర్: సామాజిక న్యాయ ఉద్యమ నిధి సేకరణలో భాగంగా బ్యాంకు ఉద్యోగుల నుంచి ఉద్యమ నిధిని సేకరించారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం ఏరియాలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా న్యాయ ఉద్యమ నిధిని సేకరిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.భిక్షపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు రణదివే వర్ధంతి నుంచి బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వరకు సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహించాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు గీట్ల లక్ష్మారెడ్డి, రవీందర్, అక్కపాక శంకర్, కాదాసి మల్లేశ్ పాల్గొన్నారు.

బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన అవసరం



అప్పన్నపేటలో సమావేశమైన మహిళలు

పెద్దపల్లిరూరల్: బాలికా సంరక్షణ కోసం అనేక చట్టాలు అమల్లో ఉన్నాయని, వాటిపై కనీస అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని జెండర్ స్పెషలిస్టు స్వప్న అన్నారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో బుధవారం బేటీపడావో.. బేటీ బచావోపై అవగాహన కల్పించారు. వీఎంవో సరిత తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పాఠశాలలో వీడ్కోలు వేడుక



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి, రచ్చపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఐదో తరగతి పూర్తయిన విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమం అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక విద్య పూర్తిచేసుకుని ఉన్నత పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతంగా ఎదగాలని ఆయన సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు నూతి మల్లయ్య, నిమ్మల రేవతి, పొన్నం సంధ్య, సేవిక అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ రామడుగు భాగ్యలక్ష్మి, వీవోఏ పుష్పలత పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



కళా ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఎలిగేడు: ఓటుహక్కు కలిగిన ప్రతి పౌరుడు ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని మండలంలోని లోకపేటలో బుధవారం సాయంత్రం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటుహక్కు వినియోగం, ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రత, బేటీ బచావో బేటీ పడావోపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, బుర్ర శంకర్ గౌడ్, కోంద్ర వెంకన్న, సలేంద్ర రాజన్న, జిన్నా రమ, దీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారి శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నియంత్రణకు పాటించాల్సిన పద్ధతులపై బుధవారం అగ్నిమాపక అధికారి దేవనంది శ్రీనివాస్ అవగాహన కల్పించారు. పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నియంత్రణకు అవసరమైన పరికరాలను పరిశీలించి ఆసుపత్రుల్లో పనిచేసే సిబ్బందికి సూచనలిచ్చారు. కొన్ని ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలు లేనట్టు గుర్తించి వాటిని వారంలోగా సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఫైర్‌మెన్ ప్రవీన్‌కుమార్, అజ్జు ఉన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



మాట్లాడుతున్న జెండర్ స్పెషలిస్ట్ సుచరిత

మంథని: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సమైక్య సమావేశంలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జెండర్ స్పెషలిస్ట్ సుచరిత మహిళలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మహిళా సాధికారతపై, బేటీ బచావో బేటి పడావో, మిషన్ శక్తి పథకం, గృహ హింస చట్టం, పనిచేసే చోట లైంగిక వేధింపుల చట్టం, హెల్ప్‌లైన్ నెంబర్లు, సఖి కేంద్రం సేవలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఏపీఎం ఎస్.పద్మ, సీసీ ఇందిర, రాంబాయి, నిర్మల, జహీంగర్ పాల్గొన్నారు.

గురుకుల బాలికల కళాశాలకు రంజన్లు అందజేత

రామగుండం: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలకు శ్రీసీతారామ సేవా సమితి, కత్తెరమల్ల రాజేశ్వరి సేవాట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పది రంజన్లు అందజేశారు. సమితి ప్రతినిధి గోలివాడ చంద్రకళ, సేవాసమితి ప్రతినిధులు కంది సుజాత, మేడి సుభద్ర, మండల రమాదేవి, కొండు రమాదేవి, సరిత, లక్ష్మి, బిల్లా శ్రీదేవి, పిట్టల చంద్రకళ, మేడగోని స్వప్న, చీమల సిరినందన్, కత్తెరమల్ల రాజలింగం, కొప్పుల శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ జెజె.థెరిస్సా, పేరెంట్ కమిటీ ప్రతినిధి క్రాంతి ఉన్నారు.